క్లుప్తంగా

ఖాదర్‌లింగస్వామి దర్గాలో ఫాతెహాలు



దర్గాలో ఫాతెహాలు నిర్వహిస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్ని భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. పిండివంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధంతో పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

క్షయ వ్యాధిపై జాగ్రత్తలు అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ పావని

కౌతాళం: క్షయ వ్యాధి పట్ల జాగ్రత్తలు అవసరం అని వైద్యాధికారిణి పావని అన్నారు. మండల పరిధిలోని పొదలకుంట గ్రామంలో గురువారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మట్లాడుతూ ముందస్తుగా వర్లబుల్ పాపులేషన్ 60సంవత్సరాలు పైబడిన వారు షుగర్, బీపీ పేషెంట్లు, పొగ తాగు వారు ఆల్కహాలు తాగేవారు, బరువు తక్కువగా ఉన్నవారు, టీబీ మందులు వాడుతున్న వారు తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ మందులు వాడేవారు వారి కుటుంబ సభ్యులకు వచ్చే అవకాశం చాల ఎక్కువ కావున వీరందరూ గళ్ల పరీక్ష, ఎక్స్‌రే తీయించుకోవాలని సూచించారు. కౌతాళంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా పరీక్షలు చేస్తారని చెప్పారు.

యోగాతో ఆరోగ్య రక్షణ



వ్యాయామ ఉపాధ్యాయులతో కలిసి యోగా చేస్తున్న ఎంఈఓ

కౌతాళం: యోగాతోనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని ఎంపీడీఓ విజయశేఖర్, ఎంఈఓ శోభరాణి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులకు యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇచ్చారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె



పట్టణంలో ర్యాలీ చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

ఎమ్మిగనూరుటౌన్: తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని స్థానిక మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ తేల్చిచెప్పారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టి దీక్ష శిబిరం నుంచి ఇంజినీరింగ్ కార్మికులు ర్యాలీగా బయలు దేరి సోమప్ప సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా గాంధీ సర్కిల్ వద్దకు చేరుకొని అక్కడ నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



గురుదాస్‌ను పరామర్శిస్తున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 31వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గురుదాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గురువారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ, పార్టీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు శివప్రసాద్, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తినాగేషప్ప,ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహుడు,నాయకులు పాల్గొన్నారు.

జాడ లేని రాయితీ రుణాలు

- అధికారులు, రాజకీయ నాయకుల సమన్వయలోపం
- మంజూరుకాని బీసీ కార్పొరేషన్ రుణాలు
- ఆందోళనలో ఆశావహులు
- రుణాల కోసం తప్పని ఎదురుచూపులు



ఎంపీడీఓ కార్యాలయంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

గోనెగండ్ల: నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించాలని ప్రభుత్వం రాయితీ రుణాలు మంజూరు చేసింది. అయితే రుణాల మంజూరులో రాజకీయం చోటుచేసుకోవడమే గాక అధికారులు, టీడీపీ నాయకుల మధ్య సమన్వయం లోపించడంతో రుణాలు అందక ఆశావహులు ఆందోళన చెందుతున్నారు.

50 యూనిట్ల మంజూరు

ప్రస్తుతం మండలానికి బీసీ రుణాల కింద 50 యూనిట్లు మంజూరయ్యాయి. మండలంలో 20 గ్రామ పంచాయతీలకు గాను ఆరు బ్యాంకులు ఉన్నాయి. ఇందులో గోనెగండ్ల భారతీయ స్టేట్ బ్యాంక్ పరిధిలో గోనెగండ్ల, అలువాల, చిన్నమరివీడు, పెద్దమరివీడు, కులుమాల, ఐరన్‌బండ, నెరుడుప్పల, ఒంటెడుదిన్నె, గాజులదిన్నె పంచాయతీలకు 19 యూనిట్లు కేటాయించారు. వర్కూరు కెనరా బ్యాంక్ పరిధిలో ఎస్ లింగందిన్నె, ఎర్రబాడు, కున్నూరు పంచాయతీలకు 5 యూనిట్లు కేటాయించారు. పెద్దనేలటూర్ కెనరా బ్యాంకు పరిధిలో పెద్దనేలటూర్, చిన్న నేలటూర్ గ్రామాలకు 7 యూనిట్లు కేటాయించారు. హెచ్.కై రవాడి కెనరా బ్యాంకులో పరిధిలో హెచ్.కై రవాడి, పుట్టపాశం గ్రామాలకు 9 యూనిట్లు కేటాయించారు. వేముగోడు యాక్సిస్ బ్యాంకు పరిధిలో వేముగోడు, తిప్పనూరు గ్రామాలకు 2 యూనిట్లు కేటాయించారు. తెర్నేకల్ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పరిధిలో గంజిహళ్లి, బైలుప్పల, బి. అగ్రహారం పంచాయతీలకు 8 యూనిట్లు కేటాయించారు.

596 మంది దరఖాస్తు

ఎన్నో ఆశలతో దరఖాస్తు చేసుకున్న వారికి ఇంతవరకు రుణాలు మంజూరు కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. బీసీ రుణాలు ఇస్తామని అధికారులు ప్రకటించడంతో 596 మంది దాదాపు ఒక్కో దరఖాస్తు ఆన్‌లైన్ ఖర్చు, మండల కేంద్రంలో నిర్వహించిన ఇంటర్వ్యూకు రావడానికి రవాణా ఖర్చు అన్ని కలిపి దాదాపు రూ.500 వరకు ఖర్చు చేసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు ఫిబ్రవరిలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. అయితే రాజకీయ నాయకులు అండదండలున్న వారికి మాత్రమే రుణాలు మంజూరు చేయాలని అధికార పార్టీ నాయకులు మౌఖికంగా ఆదేశించడంతో ఇంత వరకు రుణాలు మంజూరు కాలేదు.

నిరాశలో అభ్యర్థులు

రాయితీ రుణాలు మంజూరు వస్తే చిన్న పాటి వ్యాపారం పెట్టుకొని జీవనం సాగించాలని ఆశిస్తున్న వారు అధికారులు, రాజకీయ నాయకుల తీరుతో నిరాశ చెందుతున్నారు. ఎప్పుడు రుణాలు ఇస్తారోనని ఆశగా నిరీక్షిస్తున్నారు. పేదవారు స్వయం ఉపాధి కల్పించుకోవడానికి ప్రభుత్వం అందజేస్తున్న రుణాల విషయంలో రాజకీయ నాయకుల జోక్యంపై అర్హులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అర్హులైన వారికి సబ్సిడీ రుణాలు అందజేయాలని కోరుతున్నారు.

జిల్లా కేంద్రానికి జాబితా పంపించాం



రెండు నెలల క్రితం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి జాబితా సంబంధిత బ్యాంకులకు, జిల్లా అధికారులకు పంపాం. అక్కడి నుంచి మంజూరు జాబితా వస్తే వెంటనే ఎంపిక చేసిన వారికి రుణాలు మంజూరు చేసే చర్యలు చేపడతాం.

– మణి మంజరి, ఎంపీడీఓ, గోనెగండ్ల

చిన్నహరివాణంలో సీపీఐ గ్రామసభలు

ఆదోని రూరల్: మండలంలోని చిన్నహరివాణం గ్రామంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో గ్రామ సభలను నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు దండు హనుమంతు చేతులమీదుగా పతాకాన్ని ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు, ఆదోని మండల పార్టీ కార్యదర్శి కల్లుబావి రాజు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి కొత్తూరు గంగన్న, ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు వడ్డే సత్యనారాయణ తదితరులు పాల్గొని మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నందవరం : మండల పరిధిలోని ముగతి గ్రామ సమీపంలోని లక్ష్మీ ప్లేగమ్మ ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలయాయి. ఆస్పరి మండలం ములుగుందం గ్రామానికి చెందిన లింగన్న, రామాంజనేయులు బైక్‌పై నందవరం మీదుగా తమ స్వగ్రామానికి బయలు దేరారు. ముగతి గ్రామ సమీపంలోని ప్లేగమ్మవ్వ ఆలయం వద్ద రాత్రి 9.10 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో లింగన్నకు కుడికాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. రామాంజనేయులు స్వగాయాలతో బయటపడ్డాడు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి 108 అంబులెన్స్‌కి ఫోన్ చేసి క్షతగాత్రులను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైతులతో సబ్‌కలెక్టర్ సమావేశం



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని రూరల్: మండలంలోని కుప్పగల్ గ్రామ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం స్థల సేకరణకై గురువారం ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ సమావేశమయ్యారు. ఆదోని, కౌతాళం మండలాల సరిహద్దులో ఉన్న రైతులతో రైల్వే ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుపై చర్చించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఈ రైల్వే బ్రిడ్జి ఏర్పాటు అయితే ట్రాఫిక్ సమస్య ఉండదన్నారు. ప్రజలకు, రైతులకు, అన్నివర్గాల వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌతాళం ఇన్‌చార్జ్ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, ఆదోని డిప్యూటీ తహసీల్దార్ గుండాల నాయక్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, మండల సర్వేయర్ ఈశ్వర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నందవరం: గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రంలో గ్రంథాలయంలో శాఖ గ్రంథాలయ అధికారి వై.శివరామప్రసాద్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి రోజు చదవడం, రాయడం అలవర్చుకోవాలన్నారు. చదవడం వల్ల జ్ఞానం పొందుతారని వివరించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులకు బహుమతులను అందజేస్తున్న ఎస్‌ఐ డాక్టర్ నాయక్

పుస్తకాలతో విజ్ఞానం

ఆదోని అర్బన్: పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందని ఇస్వీ ఎస్‌ఐ డాక్టర్ నాయక్ అన్నారు. గ్రంథాలయాధికారిణి సుజాత ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో వేసవి ఒరియెంటేషన్ కార్యక్రమం ముగింపు వేడుకలు గురువారం జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌ఐ చేతులమీదుగా విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, బాక్సులు, సర్టిఫికెట్లను అందజేసి ప్రశంసించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ హరికృష్ణ, నవోదయ డైరెక్టర్ హరిక్రిష్ణ, రిటైర్డ్ హెచ్ఎం సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రంథాల సారం ఒక్కటే

- పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి
- అల్లరిమూకలకు సహకరించొద్దు
- గోవధ నేరం
- జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఆదోని అర్బన్: అన్నిమతాల గ్రంథాలు చాలా గొప్పవి. భగవద్గీత, ఖురాన్, బైబిల్‌ల సారం ఒక్కటేనని జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అన్నారు. అన్ని గ్రంథాల్లో ఒకరిని ఇబ్బంది పెట్టవద్దు, ఒకరినొకరు సాయం, సహకారం అందించుకోవాలని, గౌరవ భావం ఉండాలని, మనోభావాలను కించపరచవద్దనే ఉంటాయని, దానిని దృష్టిలో పెట్టుకుని ప్రతి మతస్తుడు పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో ఈనెల 7న బక్రీద్ పండగ సందర్భంగా ఆదోని డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో పీస్ సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా ఎస్పీతో పాటు ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పాల్గొన్నారు. ముందుగా వీహెచ్‌పీ నాయకులు విట్టా రమేష్, కునిగిరి నీలకంఠ, దేవిశెట్టి ప్రకాష్, నాగరాజుగౌడ్, ముస్లిం పెద్దలు హాతీఫ్, ముస్లిం మతస్తులు తదితరులు పండగ ప్రాముఖ్యత, సౌకర్యాల ఏర్పాటు గురించి జిల్లా ఎస్పీ, సబ్‌కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పండగ ప్రాముఖ్యతను తెలుసుకుని నిబంధనలను పాటించి జరుపుకోవాలన్నారు. గోవధ నిషేధమని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఇతర మతస్తుల మనోభావాలను కించపరిచేలా పండగను జరుపుకోవడం సరైనది కాదన్నారు. కొంతమంది అల్లరిమూకలు వారి స్వార్థం కోసం గొడవలు సృష్టించి వ్యాపారంగా చేసుకుంటున్నారని, వారికి సహకరించకుండా దూరంగా పెట్టాలన్నారు. అలాగే రెచ్చగొట్టేవిధంగా ఉన్న పోస్టులను షేర్ చేయవద్దని, మనకు మంచి జరుగుతుందా చెడు జరుగుతుందా సరి చూసుకుని షేర్ చేయాలన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాం

పండగల వేళ ఎలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ పట్టణంలో పరిశుభ్రతకు చర్యలు చేపట్టారన్నారు. చిన్నచిన్న ఘటనలు జరిగితే ఆ వీధుల్లోని పెద్దలు పెద్దవిగాకుండా చూసుకునే బాధ్యత తీసుకోవాలన్నారు. బక్రీద్ పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ శివరాములు, సీఐలు శ్రీరామ్, రామలింగమయ్య, రాజశేఖర్‌రెడ్డి, నల్లప్ప, తేజమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండండి



వేముగోడులో మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

గోనెగండ్ల : చిన్న చిన్న విషయాలకు గొడవలు పడకుండా కుటుంబాలతో సంతోషకరమైన జీవితం గడపాలని డీఎస్పీ ఉపేంద్ర బాబు సూచించారు. మండల పరిధిలోని వేముగోడు గ్రామంలో గురువారం సాయంత్రం సీఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో ప్రజలకు చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కొందరూ అల్లరి మూకలు గొడవలు సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తుంటారని, అలాంటి వారి మాటలు నమ్మకుండా గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే వాహన దారులు రోడ్డు నిబంధనలు పాటించకుండా వెళ్లడంతోనే ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటిస్తేనే ఇంటికి క్షేమంగా చేరుకోగలడని చెప్పారు కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి



బుట్టా ప్రతుల్‌ను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు అందరం ఐక్యంగా కృషి చేయాలని, ఇందుకు తన వంతుగా ముందుటానని పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్ అన్నారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకమైన ఆయనను గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయం ఆవరణలో నియోజకర్గంలోని పార్టీ శ్రేణులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో యూత్ ముందుండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాలన్నారు. ఇందుకు యువత కీలకంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన



తడి-పొడి చెత్తను పరిశీలిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ అజయ్‌కుమార్

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన చెత్త సంపద తయారీ కేంద్రాన్ని గురువారం మండల స్పెషల్ ఆఫీసర్ అజయ్‌కుమార్ పరిశీలించారు. తడి-పొడి చెత్తను పరిశీలించి, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పెంచాలని పిలుపునిచ్చారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే ఆరోగ్యం





ఆదోనిలో మొక్కలు నాటి నీరు పోస్తున్న జడ్జి అర్చన, ఎం.ఎల్.సాయిసుభాష్, కౌన్సిలర్ ఫయాజ్

గోనెగండ్ల : మొక్కలను పెంచడం వల్ల ఆరోగ్యం సిద్ధించడంతో పాటు భావితరాలకు మనం ప్రాణవాయువు ఇచ్చినవారమవుతామని ఎంపీడీఓ మణి మంజరి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం– వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కున్నూరు గ్రామంలో రోడ్డుకిరువైపుల ఏపీడీ అల్లీపీరాతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనంతసేన, ఏపీఓ మహమ్మద్ బాషా, ఈసీ వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఆదోని రూరల్: పర్యావరణాన్ని ప్రతిఒక్కరూ పరిరక్షించాలని ఆదోని మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం.ఎల్.సాయిసుభాష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అర్చన అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలోని పార్కులో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

- **ఎమ్మిగనూరుటౌన్:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి అన్నారు. హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని యల్లంబీడు ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈలు నీరజ, రాజునాయక్, ఏఈలు శరత్ చంద్ర, మదన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- **పెద్దకడుబూరు:** ప్రకృతిని ప్రేమిస్తే అది మానవ మనుగడకు తోడ్పాటును అందిస్తుందని ఎంపీడీఓ ప్రభావతి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమమాహేశ్వరి, ఈఓపీఆర్డీ జయరాముడు, హనుమపురం ఎంటీసీటీ సభ్యురాలు శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

ఆదోని టౌన్: ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పెంచాలని కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా స్థానిక వార్డులో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, శానిటేషన్ సెక్రటరీ వెంకప్ప, ఏఎన్ఎం విద్యావతి, రాణి, వెల్ఫేర్ సెక్రటరీ భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఆదోని సెంట్రల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ బి.మల్లేశ్వరయ్య అఅన్నారు. గురువారం పర్యావరణ దినోత్సవంలో భాగంగా ఆదోని రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులకు మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించాలని, పరిసరాలని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ సంజయ్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ బి.మల్లేశ్వరయ్య



జవహర్ నవోదయ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ పద్మావతి



కున్నూరులో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ మణిమంజరి, అధికారులు

తల్లి పేరుతో ప్రతి విద్యార్థి మొక్క నాటాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో ఒక మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించాలని బనవాసి జవహర్ నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి సూచించారు. గురువారం ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ఆమె మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రన్, అధ్యాపకులు పద్మజ నాన్సీ, వెంకటేశ్వర్లు, శిరీష, మీన చంద్రన్, హరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేఎల్‌బీ మార్కెట్ వేలం పాటలు



వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోనిటౌన్: పట్టణంలోని ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్ (జేఎల్‌బీ)కు గురువారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో బహిరంగ వేలంపాటలను మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలం పాటలో ఆరుగురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. కాంట్రాక్టర్ మహేష్‌బాబు రూ.61.80 లక్షలకు జేఎల్‌బీ మార్కెట్‌ను దక్కించుకున్నాడు. వేలం పాటలో పాటను దక్కించుకున్న మహేష్‌బాబుకు ఈనెల 16వ తేదీ నుంచి రుసుము వసూలు చేసుకునేందుకు అనుమతినిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

తాగునీరు వృథా



వృథాగా పారుతున్న కుళాయి నీరు

నందవరం : గ్రామాల్లో తాగునీరు లేక ఇబ్బందులు పడుతుంటే..మరో పైపు కుళాయిలకు బిరడాలు లేక వృథాగా పారిపోతున్నాయి. మండల పరిధిలోని ఇబ్రహీంపురం గ్రామంలో పాత ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద ఉన్న కుళాయికి ట్యాప్ లేక పోవడంతో నీరు వృథాగా పారితోంది. పంచాయతీ అధికారులు స్పందించి కుళాయికి ట్యాప్‌లు బిగించి వృథాగా పోతున్న నీరుని అరికట్టాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు.

సమ్మెలో కార్మికులు.. అంధకారంలో ఎమ్మిగనూరు



సోమప్ప సర్కిల్‌లో వెలగని సెంట్రల్ లైట్లు



అంధకారంలో గాంధీ నగర్‌లో ఓ వీధి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు తమ సమస్యల సాధనకై సమ్మె చేస్తుండటంతో వీధి లైట్లు వేసే నాథుడు లేక ఎమ్మిగనూరు పట్టణం గాఢాందకారంలో మునిగింది. రెండు రోజులుగా ప్రధాన రహదారిలోని సెంట్రల్ లైటింగ్ మాత్రమే వెలుగుతుండగా పట్టణంలోని ప్రధాన సెంటర్ సోమప్ప సర్కిల్‌తో పాటు వీధులన్నీ వీధి దీపాలు లేక అంధకారంలో మగ్గుతున్నాయి. దీంతో పట్టణ వాసులు రాత్రి వేళల్లో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక పట్టణ శివారు ప్రాంత వాసులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించి వీధి దీపాలు వెలిగించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.